

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఈదులగూడెం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థి దేవరపల్లి భరత్‌రాయ్ ఇటీవల బాపట్లలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభచాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 24 వరకు నేపాల్ దేశంలోని పోకరా రాష్ట్రంలో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొననున్నట్లుగా విద్యార్థి తండ్రి దేవరపల్లి వేణు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కోచ్ జాస్తి విద్యాధర్, గ్రామ పెద్దలు చిట్నేని శివరామకృష్ణ, ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, గ్రామస్థులు విద్యార్థిని అభినందించారు.



పథకాల సొమ్ము అందేనా..!



ఎన్నికల ముందు బటన్ నొక్కుడు
లబ్ధిదారుల ఖాతాల్లో నేటికీ జమకాని దుస్థితి
ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా తాత్సారం
చేయూత, విద్యాదీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇబిసి నేస్తం
లబ్ధిదారులంతా ఎదురుచూపు
రెండు జిల్లాల్లో దాదాపు రూ.500 కోట్లకు పైగా సొమ్ము పెండింగ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ముందు వివిధ పథకాలకు సంబంధించి బటన్ నొక్కినా సొమ్ము ఇప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. ఎన్నికల కమిషన్ మే 13 తర్వాత నగదు జమ చేసుకోవచ్చునని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ సొమ్ము జమ చేయకపోవడం జనాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలకు రెండు రోజుల ముందు పథకాల సొమ్ము జమపై పెద్దఎత్తున రాద్ధాంతం జరగడం, మే 14న సొమ్ము జమకు ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై జనానికి స్పష్టత ఉంది. ఎన్నికలు పూర్తయ్యి నాలుగు రోజులు గడవడంతో సొమ్ము కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. నోటిఫికేషన్‌కు ముందు మార్చి రెండో తేదీన విద్యాదీవెన, మార్చి ఆరో తేదీన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మార్చి ఏడో తేదీన చేయూత, మార్చి 14న ఇబిసి నేస్తం, ఫిబ్రవరి నెలాఖరును కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలకు సంబంధించి సిఎం బటన్ నొక్కి సొమ్ము విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నేటికి సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమకాని పరిస్థితి ఉంది. ఎన్నికలకు రెండు రోజుల ముందు ఈ పథకాల సొమ్ము జమ కోసం ప్రభుత్వం రూ.14,165 కోట్లు సొమ్ము రెడీ చేసింది. మార్చి మొదటి వారం నుంచి నిధులు జమ చేయకుండా ఎన్నికలకు రెండు రోజుల ముందు సొమ్ము జమకు ప్రభుత్వం పూనుకోవడాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకుంది. ఎన్నికలు పూర్తయిన మే 13 తర్వాత రోజు సొమ్ము జమ చేసుకోవచ్చని తెలిపింది. ఎన్నికలు పూర్తయ్యి రోజులు గడుస్తున్నా సొమ్ము జమ కాలేదు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు రూ.500 కోట్లకు పైగా సొమ్ము వివిధ పథకాల లబ్ధిదారులకు అందాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో గడిచిన ఖరీఫ్‌లో మిచౌంగ్ తుపానుతో పంటలు దెబ్బతిన్న 24,679 మంది రైతులకు రూ.20.19 కోట్లు సబ్సిడీ సొమ్ము అందాల్సి ఉంది. 45 ఏళ్లు నిండిన మహిళలకు ఇచ్చే చేయూత పథకం కింద 1,14,874 మంది మహిళలకు రూ.215.39 కోట్లు, ఇబిసి నేస్తం కింద అగ్రవర్ణ పేదలకు 12,660 మందికి రూ.18.99 కోట్లు, విద్యాదీవెన కింద 32,452 మంది విద్యార్థులకు రూ.26.42 కోట్లు, కళ్యాణమస్తు, షాదీతోఫా కింద 437 మందికి రూ.3.52 కోట్లు అందాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 32,545 మందికి రూ.26.72 కోట్లు, చేయూత కింద రూ.85,105 మందికి రూ.159.57 కోట్లు, ఇబిసి నేస్తం కింద రూ.26.69 కోట్లు, కళ్యాణమస్తు, షాదీతోఫా కింద 411 మందికి రూ.2.84 కోట్లు జమ చేయాల్సి ఉంది. శుక్రవారం కొంతమందికి విద్యాదీవెన సొమ్ము జమ చేసినట్లు తెలుస్తోంది. ఇంకా విద్యాదీవెన సొమ్ము జమ కావాల్సిన లబ్ధిదారులు ఉన్నట్లు సమాచారం. మిగిలిన పథకాలకు సంబంధించి సైతం సొమ్ము జమపై స్పష్టత లేదు. రెండు జిల్లాల్లోనూ వివిధ పథకాలకు సంబంధించి దాదాపు మూడు లక్షల మందికిపైగా లబ్ధిదారులు సొమ్ము కోసం వేచిచూస్తున్నారు. ఎన్నికల ముందు పథకాల సొమ్ము జమపై హడావుడి చేసి ఇప్పుడు ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందనే చర్చ జనాల్లో తీవ్రంగా సాగుతోంది. విద్యాదీవెన సొమ్ము సకాలంలో జమ కాకపోవడంతో ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు చేసి ముందుగానే కాలేజీలకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పథకాల సొమ్మును లబ్ధిదారులకు ఇవ్వకుండా ప్రభుత్వం తమ అనుయాయులైన కాంట్రాక్టర్లకు ఇస్తున్నట్లు ప్రచారం సాగుతుండటంతో జనంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా వెంటనే లబ్ధిదారులకు నిధులు జమ చేయాలని జనం కోరుతున్నారు.

కలెక్టర్‌చే స్ట్రాంగ్‌రూమ్‌ల తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇవిఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతతోపాటు నిరంతర పర్యవేక్షణా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఏలూరు సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇవిఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్ భద్రతా చర్యలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, పోలీస్ అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇవిఎంలు భద్రపరచిన ఏలూరు పార్లమెంట్, మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్‌రూముల వద్ద ఏర్పాటు చేసిన విజిట్ పుస్తకంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంతకం చేశారు. ముందుగా ఇవిఎంల భద్రతకు అమర్చిన సీసీ కెమెరాలు అందించే దృశ్యాలను కంట్రోల్ రూమ్ ద్వారా ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్ భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఐడి కార్డులున్న సిబ్బందిని మాత్రమే అనుమతించాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లో పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచిన తీరును ఆయన పరిశీలించారు. భద్రతా వ్యవస్థ పర్యవేక్షణకు డిఎస్‌పి స్థాయిలో నియమించిన అధికారులతో భద్రతా చర్యలపై ఆయన సమీక్షించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల ఆవరణలో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణను కలెక్టర్ ఆదేశించారు.



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

ఎస్‌పి మేరీ ప్రశాంతి తనిఖీ


సిఆర్ఆర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రతా సిబ్బంది అలసత్వం వహించకుండా అప్రమత్తతతో ఉండాలన్నారు. సీసీ కెమెరాల పనితీరు గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎఆర్ ఎఎస్‌పి ఎన్ఎస్ఎస్.శేఖర్, ఎఆర్ డిఎస్‌పి శ్రీహరిరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, త్రీటౌన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గొంతు తడిచేది చెలమల నీటితోనే..!

23 ఏళ్లుగా రోడ్డు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలకు దూరం - కలుషిత నీరు తాగి డయేరియాతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దామరచర్ల పంచాయతీ పరిధిలోని కురుములతోగు గిరిజన గ్రామంలో 23 సంవత్సరాలుగా 50 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గిరిజన గ్రామానికి రోడ్డు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. అటవీ ప్రాంతంలో ప్రమాదకరమైన విషసర్పాల మధ్యే ఆ కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ నివాసముంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అప్పటి ప్రభుత్వం వీరికి ఓటు హక్కు కల్పించిందిగానీ కనీస సౌకర్యాల కల్పనపై మాత్రం దృష్టి సారించలేదు. ఎన్నికల సందర్భంగానే ఈ గ్రామానికి నేతలు వస్తుంటారు. ఇతర సమయాల్లో ఎన్నడూ అటువైపు కన్నెత్తి చూసిన పరిస్థితి లేదు. ఈ గ్రామంలో ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే కిలోమీటరున్నర దూరం డోలి మోసుకుంటూ దామరచర్ల ప్రధాన రహదారి వద్దకు తీసుకొచ్చి అక్కడి నుంచి వాహనాలపై ఆస్పత్రులకు తరలించాలి. ఈ గ్రామంలో ఇప్పటికీ చెలమల్లోని నీటితోనే గొంతు తడుపుకుంటారు. ఆ నీటిని తాగే ఇటీవల ఇద్దరు మృతి చెందారు. మరికొంతమంది వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండ్రోజుల క్రితం కురిసిన వర్షాలకు వాగులోకి వరదనీరు చేరడంతో చెలమ నీరు కలుషితమైంది. ఆ కలుషిత నీటిని తాగడంతో డయేరియా ప్రబలి కారం బొజ్జమ్మ (60) బుధవారం మృతి చెందగా, భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి దేవయ్య (6) గురువారం ఉదయం మృతి చెందాడు. మరో ముగ్గురు భద్రాచలంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితీ ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తమ గ్రామంలో బోరు వేయించాలని, అప్పటి వరకూ ట్యాంకర్ ద్వారా తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



భద్రాచలంలో చికిత్స పొందుతున్న బాధితురాలు

తాగునీరు అందించలేని ప్రభుత్వాలు ఎందుకు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించలేని ప్రభుత్వాలు ఎందుకు ఉన్నట్లని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికే కలుషిత నీరు తాగి అతిసార వల్ల ఇద్దరు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కారం బుజ్జమ్మ, దేవల మరణానికి ఈ ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని అడిగారు. ఏజెన్సీ ప్రాంతంలోని కురుములతోగు, కొత్తూరుల్లో అతిసార వల్ల 13 మంది అస్వస్థతకు గురయ్యారని, వీరంతా వాంతులు, విరోచనాలతో ఆసుపత్రుల పాలయ్యారని తెలిపారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో 20 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారని, అయినా పాలక వర్గాలకు కనువిప్పు కాలేదని తీవ్రంగా విమర్శించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో చెలమాల నీళ్లే దిక్కని వాపోయారు. ప్రత్యేకించి వలస గిరిజనుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే అతిసార నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సౌర వ్యవస్థను బాగు చేయాలని, చేతిపంపులు, ట్యాంకుల ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని కోరారు. ఉచితంగా శుద్ధి చేసిన మంచినీటిని ఏజెన్సీ మారుమూల ప్రాంతాలకు సైతం పంపిణీ చేయాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, మొబైల్ మెడికల్ క్యాంపుల ద్వారా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

కుక్కునూరు: కురుములతోగు గిరిజనులకు వైద్యం ఖర్చులు ప్రభుత్వమే చెల్లించాలని, బాధిత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ముఖ్యకార్యకర్తల సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ మండలంలోని గిరిజన గ్రామం కురుములతోగులో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వర్షాలకు వాగులు, కాలువల ద్వారా వచ్చిన మురుగునీరు బావిలో చేరడం వల్ల ఆ నీరు తాగి గిరిజనులు మృత్యువాత పడుతున్నారన్నారు. కురుములతోగులో రెండు మరణాలు సంభవిస్తేగాని ప్రభుత్వంలో చలనం లేదని, 25 ఏళ్లుగా అక్కడ గిరిజనులు నివాసం ఉంటే చేతిపంపుగాని, విద్యుత్ సౌకర్యంగాని ప్రజాప్రతినిధులు, అధికారులు కల్పించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రయివేట్ హాస్పిటల్‌కు వెళ్లిన గిరిజనులకు వైద్యానికి అయిన ఖర్చును ప్రభుత్వమే చెల్లించాలని, ఆ ప్రాంతాల్లో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని, వారికి శాశ్వతంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సమస్యలు వచ్చినప్పుడే కాకుండా అన్ని సందర్భాల్లో ప్రభుత్వం వారిని పట్టించుకోవాలని నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, భయ్యాన శ్రీను, పట్ల లక్ష్మయ్య, శ్యామల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు ఏజెన్సీ మండలాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు మూడు రోజులపాటు చేపడుతున్నట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ఈ నెల 19వ తేదీ వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు. విస్తరణాధికారుల పర్యవేక్షణలో జరిగే కార్యక్రమాల్లో పంచాయతీ మురుగు కాలవలు, రోడ్లు శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరుపక్కల చెత్తాచెదారం తీయడం, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడం, దోమల నివారణ కోసం ఫాగింగ్ తదితర కార్యక్రమాలతోపాటు నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినకుండా, కాచి చల్లార్చిన నీరు తాగే విధంగా ప్రజలను అప్రమత్తం చేస్తారని తెలిపారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే శక్తులను ఉపేక్షించొద్దని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశించారు. నగరంలోని టుటౌన్ పోలీసు స్టేషన్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. అనంతరం టుటౌన్ పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఎన్నికలు ముగిసిన తర్వాత స్థానికంగా ఉండే ప్రజలు పార్టీల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ ఉంటారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ఉంటారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ మల్లేశ్వరరావు, ఏలూరు టుటౌన్ సిఐ ప్రభాకర్, ఎస్ఐలు సాదిక్, రవితేజ, మదీనాభాషా పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పోలీసులు ఇంటింటా తనిఖీలు

నగరంలో శాంతిభద్రతలను కాపాడేందుకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారికి చెక్ పెట్టేందుకు రెండో పట్టణ పోలీసులు శుక్రవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. చేపలతూము సెంటర్, తంగెళ్లమూడి, కొత్తపేట ప్రాంతాల్లో ఈ తనిఖీలు పెద్దఎత్తున నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించి వాహనాల వివరాలతోపాటు ఇంటిలో నివసించే వారి వివరాలు, నూతనంగా ఆయా ప్రాంతాల్లోకి వచ్చిన వారి వివరాలు తెలుసుకున్నారు. కొత్తపేట ప్రాంతాన్ని పూర్తిగా జల్లెడపట్టారు. రౌడీ షీటర్ల కదలికలపైనా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సిఐ తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

గిరిపుత్రులకు తప్పని డోలీ కష్టాలు

మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు స్పందించేదెన్నడో..!

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని గొమ్ముగూడెం పంచాయతీలోని లచ్చిపేట గ్రామస్తులకు డోలీ మోతలు తప్పట్లేదు. లచ్చిపేట గ్రామానికి చెందిన దూది కోసికి పురిటి నొప్పులు రావడంతో స్థానిక ఎఎన్ఎం రజితకు స్థానికుల సమాచారం అందించారు. వెంటనే స్పందించి రజిత 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేందు 5 కిలోమీటర్లు డోలీ మోసుకుంటూ గుండుగూడెం ప్రధాన రహదారి వద్దకు తీసుకువచ్చి, అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో గర్భిణి ఆడబిడ్డకు జన్మనించింది. అప్పుడే జన్మించిన తల్లి, బిడ్డకు మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యులు శ్రీనివాసరావు తెలిపారు. సకాలంలో ఎఎన్ఎం రజిత స్పందించడంతో తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. అలాగే గిరిపుత్రులకు ప్రభుత్వాలు ఎటువంటి మౌలిక సౌకర్యాలు కల్పించలేదని చెప్పడానికి ఇదొక ఉదాహరణగా పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు ఎన్ని జరిగినా.. ప్రజాప్రతినిధుల్లో స్పందన కరువైందని గిరిపుత్రులు వాపోయారు.




డోలీలో గర్భిణీని మోసుకెళ్లున్న గ్రామస్తులు

పోలింగ్ గతం కంటే మెరుగు

కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన ఎపి ఎన్‌జిఒలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదైందని, స్వీప్ ద్వారా ఓటరుని చైతన్యం చేసి పోలింగ్ బూత్ వరకు వచ్చేలా అన్ని ఏర్పాట్లు చక్కగా చేసారని జిల్లా కలెక్టర్‌ను ఎపి ఎన్‌జిఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అభినందించారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించినందుకు ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు శుక్రవారం కలిసి పూలమొక్క ఇచ్చి, శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా చోడగిరి శ్రీనివాస్ కలెక్టర్‌తో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారని, ఐతే దూర ప్రాంతాలకు బస్‌ల ఏర్పాట్లు తక్కువ అయ్యాయని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ఉద్యోగులకు ట్రైయినింగ్, పోలింగ్ రోజులకు సంబంధించి మొత్తం 5 రోజుల రెమ్యునరేషన్ ఇచ్చామని, ఉద్యోగ, ఉపాధ్యాయులు చాలా బాగా పని చేశారని, రాత్రి అయ్యేవరకు పోలింగ్ జరిగినా ఉద్యోగులు కష్టపడి పనిచేశారని, వారందరికీ అభినందనలు తెలుపుతూ, త్వరలోనే వారిని సత్కరించటం జరుగుతుందని కలెక్టర్ నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు కూడా పోలింగ్ స్టేషన్స్ వద్ద పనిచేశారని వారికి కూడా రెమ్యునరేషన్ ఇవ్వాలని నాయకులు కోరిన పిమ్మట ఎలక్షన్ కమిషన్ దృష్టిలో పెట్టి వారికి కూడా వచ్చేలా ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగినులు బాగా పనిచేశారని కలెక్టర్ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తాలూకా అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్ రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా ఎన్‌జిఓస్ నాయకులు నోరి శ్రీనివాస్, మహిళా విభాగం సభ్యులు సత్య భారతి, మల్లిక, నాగమణి పాల్గొన్నారు.




కలెక్టర్‌ను అభినందిస్తున్న ఎన్‌జిఓస్ నాయకులు

జోరుగా పందేలు..

పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం
అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు

ఆగిరిపల్లి: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ ముగియటం, ఫలితాలు వెలువడటానికి 20 రోజులు సమయం వుండటంతో పందెం రాయుళ్లు తమ ఊహాగానాలకు తగినట్లుగా మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో జోరుగా పందేలు కాస్తున్నారు. ఒక పక్క సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై, మరో పక్క ఐపిఎల్ క్రికెట్ పందేలపై రూ.వేలల్లో పందేలు జరుగుతున్నాయి. ఆగిరిపల్లి యూనియన్ బ్యాంక్ ఎదురుగా దమ్మన్న మండపం వద్ద పెద్ద ఎత్తున పందేలు జరుగుతున్నాయి. ఈదర, చిన్నాగిరిపల్లి, రావిచర్ల, తోటపల్లి, నూగొండపల్లి, వడ్లమాను అమ్మవారిగూడెం, ఈదులగూడెం, శోభనాపురం తదితర గ్రామాల నుంచి సాయంత్రానికల్లా పందెం రాయుళ్లు ఆగిరిపల్లి చేరుకొని మెయిన్ సెంటర్‌లోని యూనియన్ బ్యాంక్ వద్ద పందేలు కట్టె క్రమంలో తమ బైక్‌లను రోడ్డుపైనే నిలపడం, పెద్ద ఎత్తున గుమ్మిగూడి వుండటంతో యూనియన్ బ్యాంక్‌లోకి వెళ్లుటకు దారిలేక ఖాతాదారులు, వాహనదారులు, పాదాచారులు, మహిళలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కూలీ, నాలీ చేసుకొనే మధ్యతరగతి కుటుంబాల వారు సైతం తాము కష్టపడ్డ సొమ్మును పందేల పాలు చేయటంతో ఆ కుటుంబాల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారవుతుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందెం రాయుళ్లు ట్రాఫిక్‌ను సైతం స్తంభింపచేయటంతో మండల కేంద్రమైన ఆగిరిపల్లికి పలు రకాలైన పనుల మీద వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పందెం రాయుళ్లను కట్టడి చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పందెం రాయుళ్లు

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తి

వ్యవసాయ అధికారిణి ఉషారాణి

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ కార్యక్రమం పూర్తయిందని వ్యవసాయ అధికారిణి ఉషారాణి తెలిపారు. మండల పరిధిలో 12,720 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరగగా సుమారు 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని అంచనాలు ఉన్నాయన్నారు. ధాన్యం సేకరణకు ప్రత్యేకించిన 14 రైతు భరోసా కేంద్రాలు, వాటికి అదనంగా రైతు సేవా సహకార సంఘాలు సంయుక్తంగా చేపట్టిన చర్యల కారణంగా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందన్నారు. మిగిలిన ధాన్యం ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు జరిగాయన్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 28వ తేదీ వరకు జరిగిన ధాన్యం సేకరణ సొమ్ముల చెల్లింపు పూర్తయిందని, త్వరలోనే ఇతర బకాయిలు మంజూరు కానున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులను భూసారం పెంచేందుకు చైతన్యవంతులుగా చేసే క్రమంలో 50 శాతం రాయితీపై జనుము, జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వాటి సాగు జరుగుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు గాను వ్యవసాయ ప్రణాళిక రావాల్సి ఉందన్నారు. ఇక రైతుల పరంగా చూస్తే ధాన్యం సేకరణ సందర్భంగా ధాన్యం రవాణా చేసే వాహనాలకు, కాటా వేసిన వారికి తమ ఇష్టం మేరకు అది కొద్ది మొత్తాన్ని అందించామని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న ఉషారాణి



చిన్నం పేటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రోగులకు వైద్య సిబ్బంది సూచనలు

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి మండలంలోని చిన్నంపేట గ్రామంలో విష జ్వరాలతో బాధపడుతున్న రోగుల కోసం శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం పరిశీలనకు నూజివీడు డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ జాస్తి జగన్మోహన్‌రావు పరిశీలించారు. డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరు బృందాలుగా గ్రామంలో ఇంటింటికీ సర్వే నిర్వహించారు. జ్వరాలు తగ్గినా కూడా కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపు తగ్గకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురికాగా వైద్య సిబ్బంది తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. చిన్నంపేటలో వారం రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక అధికారులు నియామకం

జెసి బి.లావణ్య వేణి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వర్ష సూచనల కారణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు మండల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ధాన్యం సేకరణలో రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేలా మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని ధాన్యం భద్రపరచుకుని, నష్టం కలగకుండా చూసుకోవాలని, ఏదైనా సహాయం అవసరం అయితే దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటి వరకూ 2 లక్షల 16 వేల 740 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయం లక్ష్యానికి గాను లక్షా 98 వేల 120 మెట్రిక్ టన్నుల ధాన్యమును ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి అనుసంధానం చేయబడిన రైస్ మిల్లులకు రాండమ్ సెలక్షన్ ద్వారా తరలించడం జరిగిందని, రూ.225.67 కోట్లు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు.



సాంఘీక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం

చదువుల్లో భేష్.. వసతుల లేమితో ఇబ్బందులు

సమస్యల వలయంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట గ్రామ పంచాయతీకి కూత వేటు దూరంలో ఉన్న ప్రభుత్వ సాంఘీక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలోని విద్యార్థులు చదువులో బేష్.. వారు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. కానీ వసతుల లేమి వల్ల ఇబ్బంది పడుతున్నారు. ఈ హాస్టల్‌ను ఇరుకు గదులలో పాత ఇంటిలో నడుపుతున్నారు. ఈ వసతి గృహం మీదుగా నిత్యం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వెళుతూ ఉంటారు. కానీ ఈ హాస్టల్‌ని పట్టించుకునే వారే లేరు. కామవరపుకోట, పెదవేగి, వేలురుపాడు మండలాలు, పక్కన ఉన్న అనేక గ్రామాల పిల్లలు ఈ హాస్టల్‌లో సుమారుగా 70 మంది వరకూ ఉంటున్నారు. వీరందరికీ సరిపడా మరుగు దొడ్లు లేవు. ఇంత మంది పిల్లలకు కేవలం నాలుగు మరుగు దొడ్లు మాత్రమే వాడుకలో ఉన్నాయి. అవి కూడా పూర్తిగా పాడైపోయాయి. అయినా పిల్లలు వాటినే వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లలు పడుకునే గదులు చాల చిన్నవి. ఇటువంటి గదులలో అంత మంది పిల్లలు పడుకోవడానికి, వారి సామాన్లు భద్రపర్చుకోవడానికి అసలు చోటు సరిపోవడం లేదు. అలాగే గదుల లోపల చాలా వరకు కింద ఫ్లోర్ కూడా పాడైంది. రాత్రి సమయంలో పిల్లలకు కరెంట్ పోయినప్పుడు ఇరుకు గదులు కావడం వల్ల గాలి సరిగా అందని పరిస్థితి నెలకొంది. అలాగే హాస్టల్ దగ్గర పిల్లల రక్షణకు మంచి గేటు కూడా లేని స్థితిలో ఈ హాస్టల్ భవనం ఉంది. వీటిపై హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా మరుగు దొడ్లు, అదనపు వసతి గృహం భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అనుమతులు మంజూరైన పిదప పనులు ప్రారంభిస్తామని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే హాస్టల్‌కి అవసరమైన వసతులు కల్పించాలని పిల్లలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్తలు

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి మండలంలోని చీపురు గూడెం పంచాయతీలో శివారు గ్రామం మర్రి బంధం గ్రామంలో విచారకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌తో రెండు మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిలక వీరయ్య శుక్రవారం ఉదయం గేదెలను మేత కోసం పొలాలలోకి తోలుకొని వెళ్లగా 11 కేవీ విద్యుత్ వైర్ తెగిపడి ఉండడంతో గేదెలు మేత మేస్తూ వైరుకు తగలడంతో మృతి చెందినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల రూ.40 వేల విలువగల రెండు మూగజీవాలు మృత్యువాత పడ్డాయని చిలక వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

చిన వెంకన్న ఆలయ కాంట్రాక్ట్ ఉద్యోగులకు మోక్షమెప్పుడో..!

ఏళ్ల తరబడి పని చేస్తున్నా పర్మినెంట్ చేయని వైనం

ప్రభుత్వ జిఒలను తుంగలో తొక్కిన అధికారులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమలలో సుమారు 50 మంది కాంట్రాక్టు ఉద్యోగులు 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. వీరందరికీ వయసు 50 సంవత్సరాలకు దగ్గరికి వస్తున్నా, ఎన్ని ప్రభుత్వాలు మారినా వీరి రాతలు మాత్రం మారడం లేదని తీవ్ర నిరాశ చెందుతున్నారు. సరిపడని జీతాలతో, పిల్లలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని, అందరికీ వర్తించిన జీవోలు మాకెందుకు వర్తించవని ఆవేదన చెందుతున్నారు. రిటైర్మెంట్ వయసు దగ్గర పడుతున్నా, కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే మిగిలిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల్లో కొందరు ఇప్పటికే హార్ట్ ఎటాక్‌లతో, వివిధ కారణాలతో మరణించారని వారి కుటుంబాలకు ఎటువంటి న్యాయం జరగలేదని అంటున్నారు.



జగన్ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు ఇచ్చినా ఉత్తర్వులు చిన వెంకన్న దేవస్థానంలో ఎక్కడా అమలు కావడం లేదు. అధికారుల అండదండలు ఉన్న కొంత మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను గుట్టుచప్పుడు కాకుండా రెగ్యులరైజ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అలా జరిగితే మిగతా కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. గత సెప్టెంబర్‌లో జూన్ 2, 2014న లేదా అంతకు ముందు రిక్రూట్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవల రెగ్యులరైజేషన్ యాక్ట్ 2023ని అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం జూన్ 2, 2014(ఎపి విభజన తేదీ) కంటే ముందు కాంట్రాక్ట్‌పై పనిచేస్తున్న ఉద్యోగులందరూ క్రమబద్ధీకరించబడతారు. కానీ చిన వెంకన్న దేవస్థానంలో ఆవిధంగా చేయలేదు. ఆలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని వారు ఏళ్ల తరబడి వేచి చూస్తున్నారు.

రహదారుల ప్యాచ్ వర్క్ పనుల పరిశీలన

పనుల్లో నాణ్యత వుండాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు పట్టణంలో రహదారులు, భవనాల శాఖ ద్వారా చేపట్టి పూర్తిచేసిన రహదార్ల ప్యాచ్ వర్క్ పనులను ఆర్ అండ్ బి ఎస్ఇ జి.జాన్ మోషేతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. శుక్రవారం ఏలూరు పట్టణంలో ఆర్ అండ్ బి(ఎండిఆర్) రూ.కోటి నిధులతో మంజూరైన నాలుగు రోడ్లకు పూర్తయిన ప్యాచ్ వర్క్ పనులలో లింక్ రోడ్డు ఏలూరు-కైకలూరు, చాటుపర్రు, ఈకె రోడ్డు వయా క్లాక్ టవర్ నుంచి ఏలూరు టౌన్ వరకు, పాత బస్టాండ్ నుంచి గజ్జెలవారి చెరువు వరకు, గూడ్స్ షెడ్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వివి రోడ్డు వరకు ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆర్ అండ్ బి అధికారులతో కలిసి ఏలూరు-కైకలూరు వెళ్లే రోడ్డు, పాత బస్టాండ్ నుండి గజ్జెలవారి చెరువు వరకు వేసిన ప్యాచ్ వర్క్‌లను పరిశీలించి, స్థానికులను కూడా రోడ్డు పనులపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బి డిఇ గోవింద మోహన్, ఇఇ వైవి.కిషోర్ బాపూజీ, ఎఇ శేషుకుమార్ ఉన్నారు.




పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు ప్రవీణ్ ప్రకాష్ హైస్కూల్ సందర్శన

సన్నాహక కార్యక్రమాల పరిశీలనలో సమగ్ర శిక్ష సిఎంఒ రవీంద్ర

ప్రజాశక్తి - భీమడోలు

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం జిల్లా పర్యటనలో భాగంగా భీమడోలు హైస్కూల్‌ను సందర్శించనున్నారని సమగ్ర శిక్ష సిఎంఒ రవీంద్ర తెలిపారు. ఈమేరకు చేపట్టిన సన్నాహక కార్యక్రమాలను పరిశీలించేందుకు ఆయన శుక్రవారం హైస్కూల్‌ను సందర్శించారు. ఈయనతో పాటు సందర్శనలో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అదనపు సమన్వయకర్త సోమశేఖర్ పాల్గొన్నారు. వారు విద్యా కానుకలను భద్రపరిచిన మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ మండలానికి ఒకటి నుంచి పదవ తరగతి వరకు 38,503 పాఠ్యపుస్తకాలు అవసరం కాక ఇంతవరకు 28,182 పాఠ్యపుస్తకాలు స్టాక్ పాయింట్లకు చేరాయని తెలిపారు. వీటిలో 8, 9, 10వ తరగతికి సంబంధించి అన్ని టైటిల్‌లకు చెందిన 21,578 పాఠ్య పుస్తకాలు ఉన్నాయన్నారు. ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు వివిధ టైటిల్స్‌కు చెందిన 6,604 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, మిగిలినవి రావాల్సి ఉందని చెప్పారు. ఇదే క్రమంలో నాడు-నేడు రెండవ విడతగా పాఠశాలకు మంజూరైన ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు సమగ్ర శిక్ష సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ మెటీరియల్ విభాగం ద్వారా తలుపులు, కిటికీలు రావాల్సి ఉందని, అవి కూడా వస్తే అదనపు తరగతి గదుల సేవలు అందుబాటులోకి వస్తాయని వారి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన సిఆర్‌పిలు పాల్గొన్నారు.



పాఠ్య పుస్తకాల నిల్వలను పరిశీలిస్తున్న సోమశేఖర్, రవీంద్ర

రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తం

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

సమస్యలు పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీల పరిస్థితి అధ్వానంగా ఉందని, వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్కడ చూసినా డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురికి నీరు రోడ్లపైకి వచ్చి చేరి దుర్వాసనతో దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీలో పందుల బెడద ఎక్కువై పట్టణంలో ఎక్కడ చూసినా డ్రెయినేజీ పరిస్థితి మరీ అస్తవ్యస్తంగా తయారైంది. పందులు డ్రెయినేజీ వ్యర్థాల కోసం డ్రెయినేజీలో దిగి చిందర వందర చేయడంతో దుర్వాసన రావడానికి ప్రధాన కారణాలు అవుతున్నాయి. పిల్లలు ఒంటరిగా రోడ్లపైకి వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. పందులు పిల్లలపై దాడులకు దిగుతున్నాయి. ఇలా ఉంటే కనీసం మున్సిపల్ అధికారులు అటువైపు కూడా తిరిగి చూడకపోవడం గమనార్హం.

కనీస అవసరాలైన రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ప్రధాన హరిజన పేట వీధులలో ఎక్కడ చూసినా మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాల కాలంలో కనీసం రోడ్లు ఏర్పాటు చేయలేకపోయారు అంటూ ప్రజలు తమ నిరసనను తెలియజేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. చూద్దాం, చేద్దాం అనే భావనతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సరైన రోడ్లు లేకపోవడం వల్ల వర్షం వస్తే చాలు మెట్ట ప్రాంతం వైపు ఉన్న వర్షపు నీరంతా మట్టి రోడ్లపైకి వచ్చి చేరి కనీసం నడవడానికి కూడా వీలులేని దయనీయమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాకాలం వస్తే తమ పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుందని, పట్టణంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షపు నీరు అంతా రోడ్లపైకి రావడం వల్ల రోడ్లపై నడవాలంటేనే ఇబ్బందికరంగా ఉంటుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా తమ సమస్యకు పరిష్కార మార్గాలు వెతకాలని కోరుతున్నారు. ఎన్నికలు వస్తే ఓట్లు కోసం వచ్చే నాయకులు ఓట్లు అడగడం తెలుసు కానీ, ప్రజా సమస్యలు పట్టవా అని, కనీస అవసరాలైన రోడ్లను పట్టించుకునే నాథుడే కరువైయ్యాడని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈమధ్య ఓట్లు కోసం వచ్చిన నాయకులు మీ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని మాటలు చెప్పి వెళ్లారే తప్ప కనీసం తమ వైపు, తమ పేటలవైపు కన్నెత్తి చూడలేదని, ఇకనైనా అధికారులు చొరవ చూపించి సమస్యలు పరిష్కరించాలని పట్టణ ప్రజలు అధికారులను, నాయకులను వేడుకొంటున్నారు.



మట్టి రోడ్డు వల్ల వర్షం వస్తే బురదమయం అవుతున్న రహదారి

అర్ధరాత్రి వరకూ పోలింగ్

గెలుపుపై ఇరు పార్టీల అభ్యర్థుల ధీమా

ప్రజాశక్తి - చింతలపూడి

గతంలో లేని విధంగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవటానికి పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి లైన్‌లో నిల్చున్నారు. అర్ధరాత్రి 2:30 వరకు పోలింగ్ జరిగిందంటే ఓటు వేయటానికి జనం ఎంత ఆసక్తి చూపించారో అర్థమవుతుంది. జనం ఓటు వేయటానికి అంతలా ఆసక్తి చూపించడానికి కారణం తెలియని పరిస్థితి. అధికార పార్టీకి వ్యతిరేకంగా వేశారా? లేదా అధికార పార్టీకి ప్రతికూలంగా వేశారా అనే సందిగ్ధం నెలకొంది. గంటలకు పైగా లైన్‌లో నుంచుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు సైతం ఓటు వేయటానికి ఆసక్తి కనబరిచారు. గొడవలు జరిగినా సరే ఓటు వేయటానికి పోలింగ్ బూత్‌కు వచ్చిన వారు వినియోగించుకొని వెళ్లారు. వివిఎంలు కొన్ని చోట్ల మొరాయించటం, నిదానంగా పనిచేయటంతో ఆలస్యమైంది. చింతలపూడి నియోజకవర్గంలో 273069 మంది ఓటర్లు ఉన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో పోలింగ్ శాతం 81.52 నమోదైంది. పురుషులు 110679(82.41 శాతం), స్త్రీలు 111908(80.66 శాతం), థర్డ్ జెండర్ 21, మొత్తం 2,22,608 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇరుపార్టీలు జోరుగా మద్యం, నగదు పంపిణీ

ఎన్నికల ముందు రోజు నుంచి ఇరుపార్టీల ఓటర్లకు రూ.వెయ్యి ఇచ్చినట్లు తెలుస్తుంది. అది కాకుండా అధికార పార్టీ మహిళా మండలి గ్రూపులకు అర్ధరాత్రి నుంచి గ్రూపుకి రూ.5వేలు చొప్పున తెలవారుజాము వరకూ పంపిణీ జరిగినట్లు తెలుస్తుంది. రెండు పార్టీలు గెలుపు కోసం తీవ్రంగా కష్టపడ్డారు. ఐతే టిడిపి అభ్యర్థిగా సొంగ రోషన్ కుమార్‌ను ప్రకటించగానే చింతలపూడి నియోజకవర్గంలో టిడిపిదే గెలుపు, అత్యధిక మెజారిటీ అన్నట్లుగా ప్రచారం గట్టిగానే జరిగింది. తరువాత వైసిపి అభ్యర్థి కంభం విజయరాజు పుంజుకోవటంతో పోటా పోటీగా ప్రచారం జరిగింది. దీంతో ఏ అభ్యర్థి గెలిచినా 5 నుంచి 10 వరకు మెజారిటీ వస్తుందని టాక్ నడిచింది.

చింతలపూడి మండలంలో 4, 5 వేల వరకు టిడిపికి మెజారిటీ వస్తుందని, రూరల్‌లో అటు ఇటుగా ఉన్న టౌన్ మెజారిటీ వస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జంగారెడ్డిగూడెం, టౌన్, రూరల్ అదే పరిస్థితి. ఇంకా లింగపాలెం మండలంలో 500, 1000 ఓట్లు వైసిపికి మెజారిటీ వస్తుందని చెబుతున్నారు. కామవరపుకోట ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో తెలియని పరిస్థితి. ఇప్పటికే కోటపై అందరూ ఎదురుచూస్తున్నారు. అక్కడ ఓటర్ నాడి అర్థం కాని పరిస్థితి నెలకొంది. సైలెంట్ ఓటింగ్ జరిగినట్లుగా తెలుస్తుంది. ఈ మండలంలో వైసిపికి 8 వేలు మెజారిటీ వస్తుందని పందేలు కడుతున్నారు. ఇదే మండలంలో టిడిపి వారు 50 శాతం వరకూ డబ్బులు పంచలేదని టాక్ నడిచింది. దీని ప్రభావం ఉంటుందా? అనేదే తెలియాల్సి ఉంది. చింతలపూడి, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి 8 వేల నుంచి 10 వేల వరకు టిడిపికి మెజారిటీ వస్తుందని అంచనా వేస్తున్నారు. మహిళా మండలికి వైసిపి నైట్ నైట్‌కి నగదు పంచటంతో ప్రభావం ఉంటుందని, గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్‌కి 5 నుంచి 10 వేల వరకు, అంతకంటే ఎక్కువగా ఓట్లు వస్తాయనే చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వైసిపి ఎంఎల్ఎ అవటంతో వైసిపి ఓట్లు చీలికలు జరిగినట్లు చెబుతున్నారు. ఇదే జరిగితే టిడిపి విజయానికి మార్గం సుగమం అవుతుందని చర్చలు జరుగుతున్నాయి. ఇండిపెండెన్స్ అభ్యర్థులు ఎంత వరకు ఓట్లు చీలికలు జరుగుతాయి అనేది తెలియాల్సి ఉంది. ఇరు పార్టీలు కామవరపు కోట ఏ పార్టీకి అనుకూలంగా ఉందో ఒక కొలిక్కి రావాల్సి ఉంది. గెలుపు అనేది ఎవరికీ అంత ఈజీగా రాదు అనేది ఓటర్లు చెబుతున్నారు. ఏ పార్టీకి ఆ పార్టీ వారు గెలుపు మాదే అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మరింత భద్రత..

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అనంతరం ఇవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్‌పిలను ఆదేశించారు. ఎపి సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం సాయంత్రం సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఇవిఎంలు, వీవీప్యాట్‌ల సురక్షిత నిల్వ, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఐజిలు, డిఐజిలు, సిపిలు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ప్రతిరోజు స్ట్రాంగ్ రూమ్‌లను రిటర్నింగ్ అధికారులు సందర్శించి లాగ్ బుక్, వీడియో చిత్రీకరణలను నిర్వహించి జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, జిల్లాలో శాంత భద్రతలకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాల్లో అవాస్తవాలు ప్రచారం జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి డిఆర్ఒ ఎన్ఎస్ కె.ఖాజావలీ, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.బాబ్జి, ఎలక్షన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

శివరామకృష్ణకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ముసునూరు

ఎన్నికలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడు అండగా ఉంటూ సహాయం చేయడమే నిజమైన మానవత్వం అని జనసేన నాయకులు మరీదు శివరామకృష్ణ పేర్కొన్నారు. ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామానికి చెందిన జన సైనికుడు ముత్యాల శివకృష్ణ బైక్ యాక్సిడెంటై ఆపరేషన్ జరిగి మంచానికే పరిమితమైయ్యాడు. వేల్పుచర్ల గ్రామంలో తాపీ పని చేసుకుని, కుటుంబాన్ని పోషించుకుంటూ వుంటున్నాడు. పార్టీ, పవన్ కళ్యాణ్ అంటే అమితంగా ఇష్టపడే ముత్యాల శివకృష్ణకు ప్రమాదం జరిగిందని గ్రామ టిడిపి నేత విజయ్ బాబు, జనసేన వేల్పుచెర్ల గ్రామ నాయకులు ముత్యాల స్వామి, ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణకు తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఆయన నూజివీడు టౌన్ నాయకులు మమ్మలనేని సునీల్ కుమార్, ముత్యాల కామేష్, నాయుడు శ్రీను, బాజి, సిదార్థనగర్ నాయకులు కోటి నాయక్, శివ నాయక్‌తో కలిసి వేల్పుచెర్ల గ్రామానికి వెళ్లి శివకృష్ణను పరామర్శించి ఆర్థికసాయం చేశారు. వారి అమ్మతో అన్నివిధాల పార్టీ అండగా ఉంటుందని, ఎటువంటి సహయ సహకారాలైనా అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అబ్బూరి రవి కిరణ్, ముత్యాల స్వామి, వేల్పుచర్ల గ్రామ జన సైనికులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత ఎవరిది?

కొల్లేరు నాయకుడు మోరు రామరాజు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలు పోలీసుల చేతుల్లో ఉన్నాయా లేక దెందులూరు ఎన్‌డియే కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ రావు అదుపు ఆజ్ఞలలో ఉన్నాయా అనే ప్రశ్న తలెత్తుతోందని దెందులూరు నియోజకవర్గం కొల్లేరు నాయకుడు మోరు రామరాజు పోలీస్ యంత్రాంగాన్ని ప్రశ్నించారు. పెదవేగి పోలీస్ స్టేషన్ నుంచి నిందితుల్ని చింతమనేని ప్రభాకర్ దౌర్జన్యంగా తీసుకెల్లడం వెనక ఉన్నది ఎవరు అనేది ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం పెదవేగి పోలీస్ స్టేషన్‌లో కస్టడీలో ఉన్న నిందితుడిని తీసుకువెళ్లిన ఘటనపై రామరాజు మాట్లాడారు. ఈ విషయంపై ఏలూరు నుంచి డిఐజికి, జిల్లా ఎస్‌పికి, కలెక్టర్, ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు రామరాజు తెలిపారు. ఓడిపోతున్నామనే కక్షతో చింతమనేని అరాచకాలు ఎక్కువైపోయాయని వాపోయారు. చింతమనేని మీద 90కి పైగా కేసులు ఉంటే అటువంటి వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో దౌర్జన్యం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారన్నారు. దళితుడైన కొప్పులవారి గూడెం సర్పంచి కొడుకుపై దారుణంగా పీక కోసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను పోలీసులు పట్టుకుంటే ఆ పోలీసుల ఎదుటే నిందితుడిని చింతమనేని తీసుకుని వెళ్లడం దారుణమన్నారు. దీనిపై పోలీసులు తక్షణమే చింతమనేనిని అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని పోలీసు యంత్రాంగానికి రామరాజు విజ్ఞప్తి చేశారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, గౌతమ్ నగర్, డోర్ నెం. 4-75 కి చెందిన గుత్తా రవిచంద్ర, S/o. సోమ సూర్యబ్రహ్మం అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. ది. 14-05-2024వ తేదీన శాంతినగర్ నుండి సత్రంపాడు బ్యాంక్‌కి వెళ్ళి వస్తుండగా దారి మధ్యలో పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **X3836779.** దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

గుత్తా రవిచంద్ర
S/o. సోమ సూర్యబ్రహ్మం
డోర్ నెం. 4-75, గౌతమ్ నగర్
ఏలూరు, ఏలూరు జిల్లా
సెల్: 9966813666